epaper.manachourasta.com

# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక



బాలీవుడ్ వైపు కాంతారా..

## కాంత..

4

సంపుటి : 01 | సంచిక : 20 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | మంగళవారం, 15 డిసెంబర్ 2025 | పేజీలు : 04



2 లో

గాన గంధర్వుడికి

## ఘన నివాళి

- రవీంద్ర భారతిలో బాలు విగ్రహావిష్కరణ

17న మూడవ విడత

## పోలింగ్

- సమన్వయంతో పనిచేయండి
- జిల్లా ఎన్నికల అధికారి రిజ్వాన్ బాషా

2 లో





3 లో

కేసీఆర్ చుట్టూ

## కొరివి దయ్యాలు

- అందులో పెద్ద కొరివి దయ్యం పల్లా రాజేశ్వర్ రెడ్డి
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక
మంగళవారం, 16 డిసెంబర్ 2025
Mana Chourasta





# రవీంద్ర భారతిలో బాలు విగ్రహావిష్కరణ

**హైదరాబాద్, మన చౌరాస్తా :** ఖైరతాబాద్‌లోని రవీంద్ర భారతి ప్రాంగణంలో ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి శ్రీధర్ బాబు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతోపాటు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు హాజరయ్యారు. అనంతరం రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. భావితరాల కోసమే రవీంద్రభారతిలో బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. స్వర సార్వభౌమత్వానికి బాలసుబ్రహ్మణ్యం నిలువెత్తు నిదర్శనమని అభివర్ణించారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. నెల్లూరులోని తన ఇంటిని వేద పాఠశాలకు బాలు ఇచ్చేశారని గుర్తు చేశారు. బాలు మన మధ్య లేకున్నా.. పాట రూపంలో మనతోనే ఉన్నారని చెప్పారు. ప్రతిఒక్కరి మనస్సులో బాలసుబ్రహ్మణ్యం చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. మరోవైపు.. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడాన్ని తెలంగాణ వాదులు, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతోపాటు ఉద్యమకారుడు పృథ్వీరాజ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో విగ్రహ ఆవిష్కరణ సమయంలో నిరసన తెలిపేందుకు సిద్ధమైన తెలంగాణ వాదులను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. రవీంద్ర భారతితో పాటు ఆ పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులను మోహరించారు.



# 17న మూడవ విడత పోలింగ్

- **సమన్వయంతో పనిచేయండి**
- **జిల్లా ఎన్నికల అధికారి రిజ్వాన్ బాషా**

**జనగామ, మన చౌరాస్తా :** మొదటి, రెండవ విడత ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినట్లే.. మూడవ విడత ఎన్నికల్లో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. ఈ నెల 17న మూడవ విడత ఎన్నికలు జరిగే దేవరుప్పుల, పాలకుర్తి, కొడకండ్ల మండలాల్లో చేయాలిసిన ఏర్పాట్ల పైన అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, జడ్పీ సీఈఓ, ఆర్డివో లు, డీఆర్డీవో, డిఎస్డిఓ, ఆర్టీఓ, మండల స్పెషల్ అధికారులు, డీపీఓ, కలెక్టరేట్ ఏవో, సూపరింటెండెంట్లు, ఈడిఎం, తహసీల్దార్లతో సోమవారం కలెక్టర్ గూగుల్ మీటింగ్ ద్వారా రివ్యూ చేసి డిస్ట్రిబ్యూషన్ సెంటర్, పోలింగ్, కౌంటింగ్ మొదలగు అంశాల మీద దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లో మెటీరియల్ పంపిణీ సరిగ్గా జరగాలన్నారు. పోలింగ్ అధికారులకు నాణ్యమైన ఆహారం, తదితర సదుపాయాలు ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని మౌలిక వసతులు ఉండాలన్నారు కౌంటింగ్ వేగవంతం అయ్యేందుకు సరిపడా సిబ్బందిని పెట్టుకోవాలన్నారు. పోలింగ్ రోజే ఉప సర్పంచ్ ఎన్నిక కూడా పూర్తి చేయాలన్నారు.

# పాఠశాల సామాగ్రి ధ్వంసం

**కొమురవెల్లి, మన చౌరస్తా :** కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సెలవు రోజు కావడంతో ఆకతాయిలు పాఠశాల ప్రాంగణంలోకి ప్రవేశించి పాఠశాల యొక్క మరుగుదొడ్లు, ఎలక్ట్రిసిటీ, తాగునీటి ట్యాప్ లు ఇతరత్రా సామాగ్రిని ధ్వంసం చేశారు. విషయం తెలిసి క్షేత్రస్థాయిలో కలెక్టర్ కె.హైమావతి పాఠశాలను సందర్శించారు. పాఠశాల సామాగ్రిని ధ్వంసం ఎవరు చేశారని విషయంలో ఉపాధ్యాయులతో కలిసి ఆరా తీశారు. తక్షణమే ధ్వంసమైన వాటిని రిపేర్ చేయిస్తామని, ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. ఎలాంటి ఆధారాలు దొరికిన పోలీస్ అధికారులకు తెలపాలని పాఠశాల అధికారులకు తెలిపారు. పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. జిల్లాలో ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసిన వారిపై క్రిమినల్ కేసులతో శిక్షిస్తామని తెలిపారు.





## మహిళలకు కలగా ఉన్న వృత్తి

# నేడు చేతుల్లోకి ...

**బచ్చనపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేట మండలలోని గోపాల్ నగర్ కాలనీలో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మగ్గాల శిక్షణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. గత నెల రోజులుగా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్న మహిళలు మగ్గం పని నేర్చుకుని, తాజాగా తాము స్వయంగా రూపొందించిన ప్రత్యేక డిజైన్లను మగ్గంపై నెయ్యడం ద్వారా తమ కళ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఎన్నో రోజులుగా మేము కూడా మగ్గం నేయగలమా.. అన్నది ఒక కలగా ఉన్నదని, ఆ కల నేడు నిజమైందని శిక్షణ పొందుతున్న మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్వయంగా డిజైన్ వేసి, మగ్గంపై నేయడం ఈ అనుభవం తమ జీవితంలో మరచిపోలేని క్షణమని వారు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి ఉపాధి కల్పించే, ఆత్మవిశ్వాసాన్ని పెంచే కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం శిక్షణ పొందుతున్న మహిళలు సీట్ల పంపిణీ చేశారు .పద్మశ్రీ మల్లేశం తరచూ శిక్షణ కేంద్రాన్ని సందర్శించి, మహిళలకు మార్గనిర్దేశం చేస్తూ, మగ్గం పనిని మరింత సులభంగా అర్థమయ్యే విధంగా వివరించడం తమకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చిందని శిక్షణార్థులు పేర్కొన్నారు. అలాగే ఇక్కడి మాస్టర్ వీవర్ మహేశ్వరం రఘు ఎంతో ఓపికతో, తమ సొంత పిల్లలకంటే ఎక్కువ శ్రద్ధతో శిక్షణ ఇచ్చారని వారు ప్రశంసించారు. ఈ విధమైన నాణ్యమైన శిక్షణ కారణంగానే తాము తక్కువ సమయంలోనే మగ్గం పనిని నేర్చుకుని, ఈ స్థాయికి చేరుకోగలిగామని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. తమకు ఈ అవకాశాన్ని కల్పించి, నేర్చుకునే దారిని చూపిన ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నామని వారు తెలిపారు.



# కొమురవెల్లిలో ఘనంగా బ్రహ్మోత్సవాలు

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కొమురవెల్లి శ్రీమల్లికార్జున స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుతుతున్నాయి. రెండో రోజు ఉదయం సుప్రభాతం, మంగళవాద్య సేవ, వేద స్వస్తి , మహాగణపతి పూజ, శ్రీగౌరీ పూజ, స్వస్తివాచనం, రక్షాబంధనం, జగద్గురు పంచాచార్య పంచ కలశ స్థాపన, నాంధీ సమారాధన, ఆదిత్యాది నవగ్రహ, దిక్పాలక , సప్తమాతృక , ఏకాదశ రుద్ర, ప్రధాన రుద్ర కలశ స్థాపన ఉపచార పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీస్వామివారికి పంచామృత, ఫల, రస పంచామృతాది ద్రవ్యాలతో ఏకాదశ వార రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన నిర్వహించారు. సాయంత్రం ఆవాహిత మంటప దేవత ఆరాధనలు జరిగాయి. ఆ తర్వాత మహా మంగళహారతి, మహా మంత్రపుష్ప సమర్పణ గావించారు.



# పాలకుర్తిలో కాంగ్రెస్ విస్తృత ప్రచారం



**పాలకుర్తి, మన చౌరాస్తా :** పాలకుర్తి గ్రామంలో మూడో విడత ఎన్నికల చివరి రోజు సందర్భంగా పాలకుర్తి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కమ్మగాని పుష్పలిలా నాగన్న కత్తెర గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పట్టణ పురవీధుల్లో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహిస్తూ ప్రజల్లో ఉత్సాహం నింపారు. ఈ ప్రచార కార్యక్రమంలో పాలకుర్తి శాసన సభ్యురాలు శ్రీమతి యశస్విని రెడ్డి టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి ఝాన్సి రాజేందర్ రెడ్డి పాల్గొని ఇంటింటి ప్రచారం, ర్యాలీ ద్వారా ప్రజలను కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ గ్రామాల అభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని అన్నారు. పాలకుర్తి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, ఇందుకు కమ్మగాని పుష్పలిలా నాగన్న గారిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ స్థాయి నుంచి ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించే శక్తి కాంగ్రెస్ పార్టీకే ఉందని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే నిజాయితీగల అభ్యర్థిని ఎన్నుకోవాలని, కత్తెర గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు..




# కేశిరెడ్డిపల్లి సర్పంచ్‌గా రవి కుమార్

**ఉప సర్పంచ్‌గా చింతల రాజు**

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బచ్చన్నపేట మండలంలోని కేశిరెడ్డి పల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆరె రవి కుమార్, ఉపసర్పంచ్ గా చింతల రాజు గెలుపొందారు. తమపై నమ్మకంతో గ్రామ ప్రజలు ఆశీర్వదించి గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాభివృద్దే ధ్యేయంగా పని చేస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాన్ని అన్ని రంగాల్లో కలిసి కట్టుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానమని అన్నారు.

# కేసీఆర్ చుట్టూ కొరివి దెయ్యాలు

- **అందులో పెద్ద కొరివి దయ్యం పల్లా రాజేశ్వర్ రెడ్డి**
- **వాటి వల్లే బిఆర్ఎస్ భ్రష్టుపట్టింది**
- **ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



**స్టేషన్ ఘనపూర్, మన చౌరాస్తా :** నాపై, నా కుటుంబం పై విమర్శలు చేస్తూ తీవ్ర పదజాలంతో దూషించినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల, ఎమ్మెల్యే కడియం శ్రీహరి పట్ల ఉన్న నమ్మకంతో నియోజకవర్గ ప్రజలు ఓటేసి మెజారిటీ సర్పంచ్ లను గెలిపించారాని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... రెండు సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు పట్ల, ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేస్తున్న అభివృద్ధి పట్ల నియోజకవర్గ ప్రజలు సంతృప్తిగా ఉన్నారని దానికి తోడు మా కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరూ కృషి చేశారని, నియోజకవర్గ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఏడు మండలాలలో రెండు విడుదలగా పంచాయతీ ఎన్నికలు జరిగినాయని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ప్రస్తుతం 143 గ్రామ పంచాయతీలు ఉన్నాయని అన్నారు. 143 గ్రామపంచాయతీలలో ప్రజలు ఆశీర్వదించి అత్యధికంగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతు తెలిపారని తెలిపారు. అందులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు 94 మంది సర్పంచ్ లు ఎన్నికయ్యారని, ఇంకో ఆరుగురు ఇప్పటికే కాంగ్రెస్ రెబెల్స్ గా ఉన్నారని తెలిపారు. వాళ్ళు కూడా మాట్లాడుతున్నారు బిజెపి 1, ఇండిపెండెన్స్ 3, బిఆర్ఎస్ 39 స్థానాల్లో గెలిపోందారని తెలిపారు. 94 గ్రామపంచాయతీలు ఆరుగురు రెబల్స్ కూడా వచ్చే అవకాశం ఉందని మొత్తం 100 గ్రామపంచాయతీలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన లేదా కాంగ్రెస్ పార్టీ రెబెల్స్ గెలవడం జరిగిందని అన్నారు.

పెద్ద పెద్ద గ్రామాలు అన్ని కాంగ్రెస్ పార్టీకే వచ్చాయని ధర్మసాగర్, పెద్ద పెండ్యాల, వేలేరు, మల్కాపూర్, పల్లగుట్ట, తాటికొండ వంటి గ్రామాలన్నీ కూడా కాంగ్రెస్ పార్టీ ఖాతాలోకి వచ్చాయని కొన్ని చిన్న చిన్న గ్రామపంచాయతీలు 500 ఓట్లకు తక్కువ ఉన్న గ్రామ పంచాయతీలలో బిఆర్ఎస్ గెలిచిందని అన్నారు. మొత్తంగా భారీ మెజారిటీ కట్టబెట్టిన నియోజకవర్గ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ తరపున హృదయపూర్వకమైన ధన్యవాదాలు తెలిపారు. ఈ గెలుపుతో మా బాధ్యత మరింత పెరిగిందని, బాధ్యత పెరిగింది కాబట్టి ఇంకా జాగ్రత్తగా పని చేస్తూ నియోజకవర్గ అభివృద్ధి కొరకు నియోజకవర్గ సమస్యల పరిష్కారం కొరకు మరింత పట్టుదలతో పని చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికలలో విపరీతమైన ధోరణిలో ఒకవైపు రాజయ్య, మరొకవైపు పల్లా రాజేశ్వర్ రెడ్డి గ్రామాల్లో ప్రచారం చేస్తూ చాలా దిగజారి మాట్లాడారని అన్నారు. వ్యక్తిగతమైన దూషణలు, వ్యక్తిగతమైన ఆరోపణలు చేశారని అయినా టిఆర్ఎస్ చాలా గ్రామాలలోవారి ఉనికే లేదని కనీసం వాళ్ళు పోటీలలో కూడా లేరని అన్నారు. రాజయ్య గాని, పల్లా రాజేశ్వర్ రెడ్డి గాని విపరీతమైన ధోరణిని అవలంబించినా రాజకీయ పరిపక్వత కలిగిన నియోజకవర్గప్రజలు వారిని పట్టించుకోలేదని తెలిపారు. కొన్ని కొరివి దయ్యాల వల్ల పార్టీ భ్రష్టపడుతున్నదని, కేసీఆర్ బయటకు రాలేకపోతున్నాడని మంత్రులపైన తీవ్రమైన పదజాలంతో సాక్షాలతో సహా కవిత విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఆ కొరివి దయ్యాలలో పెద్ద కొరివి దయ్యం పల్లా రాజేశ్వర్ రెడ్డి అని ఆరోపించారు. కల్వకుంట్ల కుటుంబంలో చేరి ఆ కుటుంబాన్ని అంతా చిన్నాభిన్నం చేసాడని అందుకే కవిత దూరమైపోయింది, కేటీఆర్, హరీష్ రావు మధ్య కూడా కొంత గ్యాప్ వచ్చిందని వీటన్నిటికీ కారణం పల్లా రాజేశ్వర్ రెడ్డి అని ఆరోపించారు. అలాంటి వాడు ఇక్కడికి వచ్చి సుద్ద పూసలాగా మాట్లాడుతున్నాడని విమర్శించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో రాజయ్య కంటే ఎక్కువ గ్రామాలలో రాజేశ్వర్ రెడ్డి ఎక్కువ ప్రచారం చేశాడని తెలిసిందని ఎందుకంటే రాజయ్య గ్రామాలలో తిరిగితే ఓట్లు రావు అని పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రచారం చేశాడని అన్నారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి పార్టీలో రాజయ్యను జీరో చేయాలని చూస్తున్నాడని అన్నారు. రాజయ్య ఇప్పటికైనా కళ్ళు తెరిచి నన్ను తిట్టడం కాకుండా నీ పార్టీలో, నీపై ఎం జరుగుతుందో తెలుసుకోవాలని సూచించారు. గ్రామాలలో సమస్యలు ఏమున్నాయి, ఆ సమస్య ఎట్లా పరిష్కరించాలని మేం ఆలోచిస్తుంటే బిఆర్ఎస్ వాళ్ళు మాత్రం కడియం శ్రీహరిని ఎట్లా తిట్టాలి కడియం శ్రీహరి పైన ఎం ఆరోపణలు చేయాలనే దానికే వాళ్ళ సమయాన్ని వెచ్చిస్తున్నారని విమర్శించారు. నూతనంగా ఎన్నికైన మా సర్పంచ్ లను అందరిని కూడా ఈ నెల 18వ తేదీన నీడిగొండ సత్యసాయి కన్వెన్షన్ లో సన్మానించుకొని గౌరవించుకుంటామని, వాళ్లకు మార్గ నిర్దేశం కూడా చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.



# కడియం కలిసిన కన్నాయపల్లి సర్పంచ్, వార్డు సభ్యులు

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** ఇటీవల గ్రామపంచాయతీ ఎన్నికల్లో కన్నాయపల్లి గ్రామ సర్పంచ్ గా గెలుపొందిన లోనే అంజమ్మ మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి జిల్లా యువజన నాయకులు లోనె శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం హన్మకొండలోని ఎమ్మెల్యే స్వగృహంలో కలిసి పుష్పగుచ్చం అందించి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా నూతన సర్పంచ్, వార్డు సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. గ్రామం అభివృద్ధికి తమ సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ కథా శిక్షణ శిబిరానికి ఎంపికైన కొడకండ్ల విద్యార్థినులు




**కొడకండ్ల, మన చౌరాస్తా :** ఈనెల 27 నుంచి జనవరి 4 వరకు గుజరాత్ లోని రాజ్ కోట్ (ప్రాంస్లా)లో శ్రీ వేదిక్ మిషన్ ట్రస్ట్ వారిచే నిర్వహించబడుతున్న 26 వ జాతీయ కథా శిక్షణ శిబిరానికి కొడకండ్ల గురుకులంలో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థినులు సిహెచ్. కీర్తన, పి. మనస్విని ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్ కుమార్ ప్రకటనలో తెలిపారు. జాతీయస్థాయి కథలు సంస్కృతి సంప్రదాయాలను పంచుకోవడానికి ప్రజలలో జాతీయ స్ఫూర్తిని నింపడానికి నిర్వహించే ఈ కార్యక్రమానికి విద్యార్థినులు ఎంపిక అవడం చాలా సంతోషకరమని ప్రిన్సిపాల్ తెలిపారు.

## బాలీవుడ్ వైపు కాంతారా..

# కాంత చూపు

కాంతార చాప్టర్ 1 సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న నటి రుక్మిణి వసంత్ ఇప్పుడు కొత్త దిశగా అడుగులు వేస్తోంది. కాంతార చాప్టర్ 1 చిత్రంలో యువరాణి కనకవతి అనే ప్రతినాయిక పాత్రలో నటించి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచిన రుక్మిణి, తన కెరీర్‌లో తొలి పాన్ ఇండియా హిట్ ఇచ్చిన ఆనందాన్ని ఇప్పటికీ ఆస్వాదిస్తున్నట్లు వెల్లడిరచింది. తెలుగు, కన్నడ చిత్రసీమలకు ఇప్పటికే పరిచయమైన ఈ బ్యూటీ, ఇప్పుడు బాలీవుడ్‌లో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. అదే సమయంలో తమిళ చిత్రాల్లోనూ క్రేజీ ఆఫర్లకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్లు సమాచారం. బాలీవుడ్‌పై తన ఆసక్తిని బహిరంగంగానే వ్యక్తం చేసిన రుక్మిణి, హిందీ భాషతో తనకున్న అనుబంధమే అక్కడ నటించాలనే తపనకు కారణమని చెప్పింది. హిందుస్థాన్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. ‘హిందీ నాకు చిన్నప్పటి నుంచే పరిచయం ఉన్న భాష. మా కుటుంబానికి సైనిక నేపథ్యం ఉండటంతో, వివిధ కంటోన్మెంట్ల మధ్య అనుసంధాన భాషగా హిందీ ఉండేది. అందుకే ఆ భాషపై నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఇప్పటివరకు హిందీలో నటించే అవకాశం రాలేదు. కానీ, ఆ భాషలో నా ప్రతిభను నిరూపించుకోవాలని చాలా ఉత్సాహంగా ఉన్నాను. దేవుడి దయతో త్వరలోనే ఆ ప్రయాణం ప్రారంభమవుతుందని ఆశిస్తున్నాను‘ అని తెలిపింది.రిషబ్ శెట్టి దర్శకత్వంలో తెరకెక్కిన కాంతార చాప్టర్ 1 విడుదలై సంచలన విజయం సాధించగా, ఇందులో రుక్మిణి వసంత్ ప్రతినాయిక పాత్రలో కనిపించి ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఆమె అందచందాలు, నటన ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాయి. ప్రస్తుతం ఈ సినిమా విజయం ఇచ్చిన ఆనందాన్ని పూర్తిగా ఆస్వాదిస్తున్నానని చెప్పిన రుక్మిణి, త్వరలో కాంతార టీమ్ అంతా కలిసి విజయోత్సవాన్ని జరుపుకుంటామని వెల్లడిరచింది. ఉత్తరాఖండ్, రాజస్థాన్, జార్ఖండ్ సహా దేశం నలుమూలల నుంచి వస్తున్న స్పందనలు తనను ఎంతో ఉత్సాహపరుస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. బాలీవుడ్ ఎంట్రీతో పాటు దక్షిణాది భాషల్లోనూ రుక్మిణి వసంత్ కెరీర్ మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**